'రసరాజు'
కథ

# ఉరి పోసుకున్న గాలిపటం

గాలికి అటూ యిటూ వూగుతోన్న చెట్ల ఆకుల సందుల్లోంచి — తెల్లటి వెన్నెల కిరణాలు ఆదెయ్య పడుకొన్న పక్కమీద పడుతున్నాయి.

ఆదెయ్యకు ఆ రాత్రి కళ్ళు మూసుకొన్నా నిద్ర పట్టటంలేదు.

దూరంగా వున్న చర్చిలోంచి గంటలయితే వినబడ్డాయిగాని, ఎన్నిగంటలు వినబడ్డాయో ఆదెయ్య లెక్కపెట్టలేదు.

పక్కమీద నుంచి లేచాడు....

ముక్కముక్కల్లా పడుతోన్న వెన్నెల్నీ, చెట్ల ఆకుల నీడల్నీ గమనిస్తూ గోడకి చేరబడి కూర్చున్నాడు....

సత్రంలో—అప్పటికే అందరూ ముసుగు తన్ని నిద్రపోతున్నారు .... సగంలో చచ్చిపోయిన బీడీముక్కని నోట్లో పెట్టుకొని అగ్గిపుల్ల గీశాడు ఆదెయ్య.

అగ్గిపుల్ల వెలిగిస్తూ అలాగే ముందుకు చూస్తూ వుండిపోయాడు....

అగ్గిపుల్ల వెలిగి ఆరిపోయిందిగాని, బీడీ అంటుకోలేదు. అగ్గిపుల్ల రెండు వేళ్ళమధ్య వెలిగి ఆరిపోయాక, పక్కమీద బోర్లగా పడుకొని నిద్రగన్నేరు చెట్టు నీడలోకి చూశాడు.

రెండు ఆకారాలు....

ఒకటి—మరో ఆకారం ఒళ్ళో ఒదిగిపోయింది.

మధ్యమధ్య గుసగుసలు....

మత్తెక్కించే మల్లెల పరిమళం....

ఆదెయ్య కళ్ళు—చెట్టు నీడలోంచి తప్పుకొని — సత్రంలో పడుకొన్న జనంకేసి నడిచాయి.

ఎవరి జాగాల్లో వాళ్ళు పడుకొన్నారు.

ఒక్క కోటిగాడి చోటే ఖాళీగా కనిపించింది.

కోటిగాడి పక్కనే గురవయ్య చోటు.

గురవయ్య కుంభకర్ణుడిలా గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

గురవయ్య పక్కనే—గురవయ్య పెళ్లాం రత్తాలు చోటు.

రత్తాలు పక్కలో కుక్క దొర్లుతోంది.

....ఆదెయ్యకు ఆ సాయంత్రమే అర్థమయిపోయింది. కోటిగాడు మహాతెలివైనవాడు— ఏదో పొట్లం పట్టుకొచ్చి రత్తాలు కిచ్చాడు ఆ సాయంత్రం. అవి మల్లెపూలే అయ్యుంటాయని ఆదెయ్య ఊహ.

అలా పడుకొనే ఆదెయ్య నిద్రగన్నేరు చెట్టునీడలోకి చూశాడు.

అక్కడక్కడా సగం వెన్నెల....సగం నీడ... ఆ వెలుగునీడల మధ్యన నలిగిపోతున్న మల్లెల పరిమళం....

* * *

ఆదెయ్య ఒక్కడు....

అతని చుట్టూ సత్రంలో జనం....

"నాయాల....సీతారాముల్లాంటి పెళ్ళానీ, మొగుడ్నీ ఇడదీత్తావా—నన్ను అడ్డం పెట్టుకొని...." కోటిగాడు ఆదెయ్యమీద విరుచుకు పడిపోతున్నాడు.

"ముసిడి సచ్చినోడా .... నీ జిమ్మడ...." రత్తాలు వేళ్ళు విరుస్తోంది.

"నా కొడకా....మక్కెలిరగతంతాను —" గురవయ్య కసిగా ముందుకురుకుతున్నాడు.

"....నువ్విలాటి తప్పుడుకూతలు కూసేవంటే నూకలు చెల్లిపోతాయ్‌రోయ్!" నిలబెట్టి తిడుతున్నారు మిగతావాళ్ళు.

అలా అరగంటవరకు ఆదెయ్యని దుయ్యబడుతూనే వుంది సత్రం.

ఆదెయ్య బిక్కచచ్చిపోయాడు.

రత్తాలుకీ, కోటిగాడికీ వున్న సంబంధం గురించి ఆదెయ్య యెక్కడో నోరు పడేసుకున్నాట్ట....

అది "గాలివాన" అయింది.

అలా మొదలయిన గాలివాన ఎడతెరపి లేకుండా సత్రంలో రోజూ కురుస్తూనే వుంది.

ఆదెయ్యకూ, సత్రానికీ బొత్తిగా పొత్తు కుదరడంలేదు.

సత్రం—ఆదెయ్యని పూర్తిగా వెలేసింది.

ఆదెయ్య ఒక్కడూ ఒకటి అయితే-సత్రం అంతా ఒకటై ఆదెయ్యమీద పడగ విప్పింది.

....ఆదెయ్యకు ఈ ఒంటరితనం భరించరానిదే అయింది. ఎప్పుడు ఏ అఘాయిత్యం తనమీద తలపెడతారోనన్న భయం ఆదెయ్య మనసులో చోటుచేసుకొంది.

ఏదో వంకపెట్టి ఆదెయ్యని సత్రం రోజూ తిడుతూనే వుంది.

తనకు "నా" అన్నవాళ్ళు లేరు.

ఆ సాయంత్రం....

ఆదెయ్య దిగులుగా తలొంచుకొని ఎటో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

గూటిలో చిలక అరిచింది....

పైకిలేచి-చిలకని చేతిలోకి తీసుకొని— దాన్నోసారి ప్రేమగా నిమిరాడు. ఆదెయ్య కా అరుపు కొండంత ఊరట కల్పించినట్లయింది.

ఆదెయ్యకదే నేస్తం. అది ఎగరలేదు.

బాగా పొద్దుపొడిచాక—చిలకని భుజం మీత పెట్టుకొని—గుమ్మాలన్నీ తిరిగి అడుక్కోడం ఆదెయ్య డ్యూటీ.

ఓ రోజు ఉదయం....

పక్కమీద నుంచి లేస్తూనే గూట్లోకి చూశాడు.

పాదాలకింద ఏదో మెత్తగా తగిలినట్లయి కిందకి చూశాడు.

చిలక....

దానిచుట్టూ చీమలు....

అది తన చిలకే....

దాని పీకపై ఎవరివో కబంధహస్తాల ముద్రలు....

మసిమీద పగ—చిలకమీదికి మళ్ళింది.

సత్రం చేసిన పనికి ఆదెయ్య మనసు నీరు కారిపోయింది.

కళ్ళముందు కబళాన్ని ఒక్కసారి-ఎవరో కాలదన్నినట్లయింది.

వడ్డించిన విస్తరిని-విసిరేసినట్లయింది....

ఆదెయ్య ఒంటరిగా ఉన్నప్పుడు-ఆ చిలక పలకరిస్తుండేది—స్నేహితుడిలా. ఆ నేస్తం లేదిప్పుడు....

ఆదెయ్య పొట్టకి ఆ చిలకే యింత కూడు పెట్టేది — తల్లిలా.

ఆ తల్లి లేదిప్పుడు....

ఆ చిలకగూటిలో "చిలక" ఎగిరిపోవడం గుడ్డోడిచేతిలో కర్ర విరిగినట్లయిపోయింది ఆదెయ్యకి.

....సత్రంకేసి చూశాడు.

సత్రం-గుడ్లగూబలా కనిపించింది.

ఆదెయ్య కా దిగులు నెలవరకూ విడిచిపోలేదు.

అడుక్కోడానికి పోయినప్పుడు "భుజమ్మీద చిలకేదీ" అని పిల్లలడిగితే తన గుండె

కేసి చూపించేవాడు ఆదెయ్య—మరేపీ చెప్ప లేక.

....ఆదెయ్య కన్నీళ్ళతో-సత్రం-రోజూ చప్పిక తీర్చుకొంటోంది.

*  *  *

ఒంటరితనం — ఆదెయ్య మనస్సుమీద రోజూ దెబ్బతీస్తూనే వుంది. అది భరించడం ఆదెయ్యకు కష్టమైపోయింది.

అడుక్కోడానికి పోతే,ఇన్ని గింజలు కూడా దొరకడంలేదు.

"ఏదో కష్టపడి పని చేసుకోకూడదూ...." అందరూ ఇదే మాట.

చిలక వున్నప్పుడు ఈ మాటలు విని పించేవి గావు.

అడుక్కోడానికిప్పుడు ఆధారం తప్పని సరయింది ఆదెయ్యకి—ఒంటరితనం మాట ఎలా వున్నా.

....ఓ సాయంత్రం — ఆదెయ్య—ఒంట రిగా కాకుండా తోడుగా వచ్చేడు సత్రంలోకి.

"తోడు"ను చూడగానే సత్రం కళ్ళల్లో— ఎర్రజీరలు మెరుపు తీగల్లా పాకాయి.

"ఈడిబతుక్కిదొకటి...." సత్రం చెవులు కొరుక్కుంది.

తోడుగా కొనితెచ్చుకొన్న కోతిపిల్లని గొలుసుతో చెట్టుకి కట్టేశాడు ఆదెయ్య.

....కోతి రాకతో ఆదెయ్య జీవితంలో మళ్ళీ వసంతం తలెత్తింది. ఆశలు చిగుళ్ళు తొడి గాయి.

దానికి పువ్వులగౌను కుట్టించాడు-ముచ్చట పడి. ఏంపీ తోచనప్పుడల్లా దాన్ని పొట్టమీద పడుకోబెట్టుకొని—బిడ్డలా దాన్ని నిమురుతూ తృప్తిగా గాలి పీలుస్తుండేవాడు.

ఆదెయ్య పరధ్యానంగా వుంటే—తల్లో పేలుచూస్తూ ఆదెయ్యను తనవేపుకి తిప్పుకుం టుండేది ఆ కోతిపిల్ల. అప్పుడప్పుడు చేతికి దొరక్కుండా ఆదెయ్యని ఆట పట్టిస్తుండేది.

ఆ కోతిపిల్ల—ఆదెయ్యకు కొత్త వూపిరి పోసింది.

ఏ గుమ్మం ఎక్కినా ఇన్ని బియ్యం గింజలు దొరుకుతున్నాయి. కడుపు నిండుతోంది. గుమ్మాలముందు పిల్లలంతా గుమికూడి కోతి పిల్లకి కొబ్బరి ముక్కలు, కూరగాయలు పడ వేస్తున్నారు.

"కష్టపడి పనిచేసుకోకూడదూ...." అన్న మాటలిప్పుడు వినిపించడంలేదు.

ఆదెయ్యకు ఈ ఆనందం ఎంతో కాలం మిగల్లేదు. కొని తెచ్చుకొన్న ఆనందం-కొండ గట్టిన దీపమై ఆరిపోయింది.

తెల్లారి లేచాడు—మామూలుగా.

కోతి కనపడటం లేదు.

పిచ్చెక్కినోడిలా సత్రంచుట్టూ తిరిగాడు....

చెట్లన్నీ వెతికాడు....

బావిలోకి చూశాడు.

తల బాదుకున్నాడు.

కోతి కనబడలేదు.

సత్రంలోకి చూశాడు.

సత్రం "ఆనందం" పంచుకొంటోంది.

కళ్ళు ఎరుపెక్కాయి.

ఒళ్ళు వేడెక్కింది.

పెదవు లదురుతున్నాయి.

అయినా తమాయించుకున్నాడు.

తనొక్కడూ ఒకటి....

ఎదురు తిరిగితే—ఏం జరుగుతుందో తనకు బాగా తెలుసు. మనుషుల్ని తిడితే లాభంలేదని దేవుణ్ణి కసిగా ఓసారి తిట్టేసి ఊరుకున్నాడు.

ఇది జరిగిన మర్నాడు—అసలు వూళ్ళోకే వెళ్ళలేదు. అడుక్కునే ఆధారం అందీ అంద కుండా అదృశ్యమైపోయింది. తనకో ఆధారం వుంటే సత్రం ఒప్పుకోదు.

మరో చిలక....మరో కోతి....ఏదయినా కానీ—అన్నీ సత్రానికే అంకితం.


ఇక్కడ బతికి బట్టకట్టడం సమస్యగానే తోచింది.

ఆదెయ్య ఓ నిర్ణయానికొచ్చాడు — బాగా ఆలోచించి.

అయితే ఇన్నేళ్ళుగా తనకింత గంజిపోసి, ఆశ్రయమిచ్చిన ఊరునీ, సత్రాన్నీ వదలి వెళ్ళ డము ఆదెయ్యకి కష్టమనిపించింది. కాళ్ళు ఆడలేదు....







అలాగే ఆకాశంలోకిచూస్తూ కూర్చున్నాడు- నడిసముద్రంలో దిక్సూచి పనిచేయని నావి కునిలా.

*  *  *

చీకటి చెదిరిపోయి — చిరువెలుగు — లోకాన్ని రాగరంజితం చేస్తోన్న వేళ అది.

ఆదెయ్యకు అదేవిటో అర్థంకాలేదు.

పొట్టమీద ఎత్తుగా ఓ కంతి బయల్దేరింది. చూడ్డానికది విచిత్రంగా, వికృతంగా వుంది. నెల్నాళ్ళ క్రితంనుంచీ అది పెరుగుతూ వచ్చింది.

కుంటినాగన్నకా విషయం తెలిసీ తెలి యగానే ఎంతో బాధపడిపోయాడు. మూగ దాసరయ్య ముందే ముడుచుకుపోయాడు.కోటి గాడు కుంచించుకుపోయాడు. గురవయ్యగుండె నీరసంగా మూలిగింది. రత్తాలు బుర్ర సరేసరి రంగుల రాట్నంలా తిరిగిపోయింది.

పాడుబడ్డ సత్రం బాధతో ఒక్కసారిగా సుళ్ళు తిరిగిపోయింది,

ఆదెయ్య మాత్రం బాధపడలేదు. అదోలా అయిపోయి ఎదురుగావున్న కాలవకేసి కళ్ళు తిప్పలేదు. పాడుబడ్డ బావికేసయినా కనీసం చూడలేదు.

ఆనందంగా వున్నాడు....

ఆశల్ని గుండెచుట్టూ పేర్చుకొన్నాడు.

అడుక్కోడానికి ఆదెయ్యక్కూడా ఓ బల మయిన ఆధారం దొరికింది.

అలా ఎందుకు దొరికిందనే మిగతావాళ్ళ బాధ!

....ఆదెయ్య సంతోషాని కవధుల్లేవు.

"రేపట్నుంచి ఆదెయ్య కంతిని అందరూ అదోలా చూస్తారు....ఆ వెనుక జాలి..పైసలు ....ఆదెయ్య రేపట్నుంచి పూలరంగడే...." సత్రం అసూయతో మూలిగింది. ఈర్ష్యతో కళ్ళలో నిప్పులు పోసుకొంది.

ఆ మర్నాడు....

నాలుగురోడ్లూ కలిసే బ్రహ్మాండమయిన సెంటరులో — బ్రాందీషాపు కెదురుగావున్న గాంధీబొమ్మ దగ్గర చిన్నచోటు దొరికింది ఆదెయ్యకి.

ఆదెయ్య అక్కడ కూర్చున్నాడు....

అందరికీ తన "కంతి"ని చూపిస్తూ అడు క్కోడం మొదలెట్టాడు.

వచ్చేపోయే జనం—ఆదెయ్య పొట్టమీద లేచిన కంతిని విచిత్రంగా చూస్తూ—జాలితో

అయిదో పదో పైసలువడేసి "అయ్యోపాపం" అనుకొంటూ వెళ్ళిపోతున్నారు.

....సాయంత్రం గడిచింది.

క్రమంగా చీకటికూడా పడింది.

ఆదెయ్య సత్రంలోకొచ్చి అటూయిటూ చూశాడు.

ఎవరూ—గూడు చేరుకోలేదింకా....

మెల్లగా డబ్బామూత తీశాడు.

చిల్లరంతా గుమ్మరించాడు.

"అయిదు రూపాయిలు....పైన మరో పదిహేను పైసలు....!"

కంతి కనకవర్షం కురిపించింది....

ఆదెయ్య గర్వానికి అవధుల్లేవు....

ఆశ్చర్యం, ఆనందం — రెండూ ఒకేసారి గుండె తలుపు తట్టాయి. ఆశల గాలిపటాన్ని ఆకాశంలో ఎగరేసుకొన్నాడు.

ఆదెయ్య కారోజు పండగే అనిపించింది.

అలాంటి పండగలు చూడటం ఆదెయ్యకి క్రమంగా మామూలయి పోయింది.

ఆదెయ్య హాయిగా బతుకుతున్నాడు.

సత్రం ఏదో వంకపెట్టి ఆదెయ్య అదృష్టాన్ని రోజూ తిడుతూనే వుంది. ఎవరెన్ని తిట్టినా—ఆదెయ్య రోజూ తన "కంతి"కేసి చూసుకొని మురిసిపోవడం మాత్రం మానలేదు.

* * *

ఆదెయ్యకు ఆరోజు జ్వరం.

శరీరంమీద చెయ్యేస్తే —, నిప్పులా కాలిపోతోంది.

మంచినీళ్ళిచ్చే మనసు లేదు.

సత్రం బండరాయిలా చూస్తోంది - నిలబడి.

దగ్గిరలోవున్న గవర్నమెంటు హాస్పిటల్, ఆదెయ్య మనసులో మెదిలింది.

....ఆదెయ్య ఆస్పత్రిలో అడుగుపెట్టాడు.

మందిచ్చి—కంతికేసి చూశాడు డాక్టరు.

"కంతికోసి, కడుపు కొట్టొద్దు డాక్టరు బాబూ....!" అన్నట్లు తిరిగిచూశాడు ఆదెయ్య అంత జ్వరంలోనూ.

డాక్టరుబాబు ఆ "కంతి"ని రోడ్డుమీదరోజూ చూస్తూనే వున్నాడు.

"జ్వరం తగ్గినా, మళ్లా రెండ్రోజులకే వస్తుంది....ఓ పదిహేను రోజులపాటు వచ్చి మందు తీస్కో....పూర్తిగా నయమవుతుంది" అన్నాడు డాక్టరుబాబు.

డాక్టరుగారి మంచి మనస్సుకి రెండుచేతులు జోడించాడు ఆదెయ్య — మరెలా కృతజ్ఞత చెప్పుకోవాలో తెలీక.

* * *

ఆకాశం కన్నీళ్ళు కురుస్తోంది.

తూరుపు తెల్లారింది కానీ, వెలుగింకా పూర్తిగా విచ్చుకోలేదు. సత్రంలో అటుపక్క అందరూ లేచారు. లేచింది మొదలు అందరూ ఆదెయ్యనుచూసి, ఆనందంగా నవ్వుకొంటున్నారు. మధ్యమధ్య చెవులు కొరుక్కుంటున్నారు.

సత్రానికి పక్కగా ఆదెయ్యకూడా లేచి కూర్చున్నాడు. అదోలా వున్నాడు.

దిగులుగా—దీనంగా వున్నాడు.

వారం రోజుల్నుంచీ ఆదెయ్య మనసే మారిపోయింది. ఆలోచించేకొద్దీ అగాధంలోకి జారిపోతున్నట్లనిపించింది....పొట్టకేసి చూసుకున్నాడు నిరాశగా.

"కంతి" క్రమంగా కరిగిపోయింది.

మనసు మూగబోయింది....

డాక్టరుబాబు "జ్వరం" పేరుతో "కంతి" మీద వైద్యంచేసి కడుపుకొట్టాడన్న భావం ఆదెయ్యాన్ని నిర్వీర్యుణ్ణి చేసింది.

ఎగరేసుకొన్న ఆశల గాలిపటం ఎక్కడో గింతచెట్టుకి ఉరిపోసుకొని నీరసంగా మూలిగింది. □



